పెన్నాలో జలకళ... పాపఘ్ని వెలవెల

ఒకే ప్రాంతంలో విభిన్న పరిస్థితులు



సిద్దవటం శివారులో పెన్నానదిలో ప్రవహిస్తున్న నీరు


ఓ వైపు పెన్నానది జల సవ్వడితో సందడి చేస్తుంటే, మరోవైపు పాపఘ్ని నదిలో చుక్కనీరు లేక ఎడారిని తలపిస్తోంది. ఒకే జిల్లాలో విభిన్న పరిస్థితులకు ఇది దర్పణంగా నిలుస్తోంది. ఎగువన కర్నూలు, నంద్యాల జిల్లాల్లో భారీ వర్షాలు కురవడంతో ఆ నీరంతా కుందూ నదిలోకి చేరుతోంది. అక్కడ నుంచి కేసీ కాలువ ఆయకట్టుకు సేద్యపు జలాలు విడుదల చేశారు. మైలవరం జలాశయం గేట్లు ఎత్తి కిందకు వదిలారు. ఈ నీరంతా పెన్నా నదిలో చేరి జలకళ సంతరించుకుంది. మరోవైపు అన్నమయ్య జిల్లా నుంచి వైయస్‌ఆర్‌లో ప్రవహించే పాపఘ్ని నదిలో వర్షాభావ పరిస్థితులతో జలం జాడ లేకుండా పోయింది. వెలిగల్లు జలాశయంలోకి కూడా పెద్దగా నీరు రాలేదు. పాపఘ్ని వెలవెలబోయి కళావిహీనంగా కన్పిస్తోంది. - ఈనాడు, కడప, న్యూస్‌టుడే, ఒంటిమిట్ట



పెండ్లిమర్రి మండలం నందిమండలం సమీపంలో నీటి జాడ లేని పాపఘ్ని నది

వీణాపాణి... విద్యావాణి

దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా బుధవారం అమ్మవారు చదువుల తల్లి సరస్వతిగా భక్తులకు దర్శనమిచ్చారు... జిల్లా వ్యాప్తంగా ప్రముఖ ఆలయాల్లో తెల్లటి దుస్తుల్లో తేజోమయ రూపిణిగా జగన్మాత భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రుల్లో సరస్వతి దేవిని పూజిస్తే విద్య, బుద్ధులను ప్రసాదిస్తుందని, జ్ఞానరాశులను ప్రసాదిస్తుందని భక్తుల నమ్మకం. పలు ఆలయాల్లో కాళరాత్రిగా అమ్మవారిని అలంకరించారు. ప్రధాన ఆలయాల్లో అమ్మవారి దివ్య రూపాన్ని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. ఆయా కార్యక్రమాల చిత్రాలివి. - న్యూస్‌టుడే, అన్నమయ్య బృందం



కడప నగరంలో సరస్వతి దేవిగా బాలపోలేరమ్మ దర్శనం



శ్రీవిజయ దుర్గాదేవి ఆలయంలో భక్తుల బారులు




అమ్మా... కటాక్షించుమా



విజయదుర్గ అమ్మవారి ఆలయంలో కాళరాత్రి అలంకారంలో...



కడప అమ్మవారిశాలలో భక్తజన సందోహం



జమ్మలమడుగు మండలం కన్నెతీర్థంలో సరస్వతీదేవిగా...



ప్రొద్దుటూరులో సరస్వతీదేవిగా కన్యకా పరమేశ్వరి దర్శనం

ఆరుగురు రెవెన్యూ సిబ్బందిపై కొరడా

- అవినీతి నిరోధకశాఖ సిఫార్సుతో చర్యలు
- అందరూ బ్ర.మఠంలో పనిచేసిన వారే

ఈనాడు, కడప: బ్రహ్మంగారిమఠం తహసీల్దార్ కార్యాలయంలో గతంలో పనిచేసిన రెవెన్యూ అధికారులు, సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని అవినీతి నిరోధకశాఖ సిపార్సు చేసింది. ఈ మేరకు తాజాగా ఉత్తర్వులు వెలువడ్డాయి. వైకాపా హయాంలో 2020 జనవరి 24న అనిశా దాడులు చేసిన సమయంలో అక్రమంగా నగదు కలిగి ఉన్నట్లు గుర్తించి కేసులు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా అక్రమాలు, అవినీతిని నిగ్గు తేల్చి అభియోగాలు నమోదు చేశారు. ఇందులో భాగంగా అప్పట్లో తహసీల్దారుగా పనిచేసిన ఎం.దైవాదీనం (ప్రస్తుతం సుండుపల్లె), డిప్యూటీ తహసీల్దార్ చంద్రలీల (బద్వేలు ఆర్డీవో కార్యాలయం), సీనియర్ అసిస్టెంట్ వెంకట రమణ (ఎలక్షన్ సెల్, బద్వేలు) రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాగాల యానాదయ్య (బద్వేలు ఆర్డీవో కార్యాలయం), జూనియర్ అసిస్టెంట్ నాగేంద్రకుమార్ (పౌరసరఫరాలశాఖ, కడప), వీఆర్‌ఏ కాశీం పీరా (సోమిరెడ్డిపల్లె)లపై సర్వీసు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోనున్నారు. ఉద్యోగ విరమణ అనంతరం పింఛన్లు నిలిపివేయడం, ఇంక్రిమెంట్లు రద్దు తదితర చర్యలుంటాయని ఉత్తర్వుల మేరకు తెలుస్తోంది.

ఎస్‌ఈగా చెన్నకేశవరెడ్డికి ఉద్యోగోన్నతి

ఈనాడు, కడప: ప్రజారోగ్యశాఖలో ప్రొద్దుటూరు ఈఈగా పనిచేస్తున్న ఎన్.చెన్నకేశవరెడ్డికి ఎస్‌ఈగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు పైఉత్తర్వులు ఇచ్చారు. అయితే పోస్టింగ్ ఇవ్వలేదు. ఈఈగా దీర్ఘకాలికంగా కడపలో పనిచేశారు. జిల్లాలోని వైకాపా నేతకు సమీప బంధువైన చెన్నకేశవరెడ్డి కడప నగరపాలక సంస్థ ఎస్‌ఈగా పనిచేయడానికి ముమ్మర యత్నాలు చేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది.

చరమాంకం... భద్రత ప్రశ్నార్థకం

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే

ఉమ్మడి కడప జిల్లాలో ఎక్కువ మంది విశ్రాంత ఉద్యోగులు కడప నగరంలో నివాసం ఉండడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో నగరంలోని శివారు ప్రాంతాలైన రామాంజినేయపురం, రిమ్స్, సింగపూర్ సిటీతో పాటు ఎల్‌ఐసీ కాలనీ, ఎస్‌బీఐ కాలనీ వంటి ప్రాంతాలను ఉదాహరణగా పేర్కొనవచ్చు. రైలు, రోడ్డు, విమాన మార్గాలు అనుకూలంగా ఉండడం, ఆంధ్రా-కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న చాలామంది ఉద్యోగులు శేష జీవితాన్ని గడపడానికి ఎక్కువగా ఇష్టపడుతున్నారు. జిల్లాలో అత్యధికంగా విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులు ఉన్న పట్టణం కడప. వీరి పిల్లలు ఉన్నత చదువులు, ఉద్యోగాల్లో స్థిరపడి విదేశాల్లో, వివిధ రాష్ట్రాల్లో, పక్క జిల్లాల్లో నివాసం ఉంటున్నారు. సొంతిల్లు, అన్ని సదుపాయాలు ఉండడంతో బిడ్డలను వదిలి ఎక్కువ మంది వృద్ధులు ఇక్కడే నివాసం ఉంటున్నారు. ఒంటరిగా జీవనం సాగిస్తున్న ఇలాంటి వారి భద్రత, రక్షణ ప్రశ్నార్థకంగా మారింది. విశ్రాంత ఉద్యోగులు కావడం, పిల్లలు బయట ప్రాంతాల్లో ఉండి నిర్వహణకు కొంత డబ్బు పంపడం, వారికి అందుతున్న పింఛను తదితర సదుపాయాల వల్ల విలాసవంతమైన ఇంటి నిర్మాణాలతో జీవనం సాగిస్తున్నారు. బిడ్డలు ఎక్కడో ఉండటం వల్ల వీరిని పట్టించుకునేవారే కరవౌతున్నారు.

స్వర్ణకుమారి హత్యతో ఉలిక్కి పడ్డ వృద్ధులు

అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని జగన్‌కాలనీకి చెందిన స్వర్ణకుమారి కుమారుడు నాగేంద్ర ప్రసాద్ ధర్మవరంలో సీఐగా విధులు నిర్వహిస్తున్నాడు. స్వర్ణకుమారి చాలాకాలంగా సొంతిల్లు నిర్మించుకుని ఒంటరిగా ఉంటోంది. ఈ నేపథ్యంలో తనకు తెలిసిన, స్వగ్రామానికి చెందిన వెంకటేష్‌ను బిడ్డకంటే ఎక్కువగా చూసుకుంటూ అతనితో ఇంటికి అవసరమైన వస్తువులు తెప్పించుకునేది. ఆమె ఒంటరిగా ఉండటాన్ని అవకాశంగా తీసుకునే అతడు స్నేహితుడితో కలిసి హత్యకు ఒడిగట్టాడు. ఆమె కుమారుడు పోలీసు అని తెలిసి కూడా నిందితుడు ఇంతకు తెగించాడంటే ఇక సాధారణ వయో వృద్ధుల పరిస్థితేమిటో అర్థం చేసుకోవచ్చు.

ఒంటరి వృద్ధులు... వారికి నా అన్న దిక్కు ఉండదు... దాడిని ప్రతిఘటించే శక్తి శూన్యం... వారి వద్ద ఉన్న సొత్తు, సొమ్ములు సులభంగా దోచుకోవచ్చు... అభిమానం, ప్రేమ, ఆప్యాయతలకు దూరంగా వారిని నమ్మించి బుట్టలో వేసుకోవడం సులభం.. అవసాన దశలో అనారోగ్య సమస్యలు చుట్టుముడుతుంటాయి... వారిని ఆసుపత్రులకు తీసుకెళ్లడం, అవసరమైన సరకులు తెచ్చివ్వడం ద్వారా సన్నిహితంగా ఉంటూ అవకాశం చూసుకుని క'బలి'స్తున్నారు. నిందితులు ఎవరో కొత్తవారు కాదు... వారికి తెలిసిన వారు, పరిచయం ఉన్న వ్యక్తులు, బంధువులూ ఇలా చుట్టూ ఉన్న వారే. మదనపల్లెలో శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం సీఐ నాగేంద్ర ప్రసాద్ తల్లి స్వర్ణకుమారి దారుణహత్యతో ఈ విషయం మరోసారి చర్చనీయాంశంగా మారింది. అందుకే ఒంటరి వృద్ధులూ తస్మాత్ జాగ్రత్త, వారికి దూరంగా ఉన్న బిడ్డలూ మీ తల్లిదండ్రుల రక్షణ మీ బాధ్యత.

జిల్లాలో విశ్రాంత ఉద్యోగులు	కడపలో నివాసం ఉన్నది :
4,500 మంది	2,100 మంది

14567

వయో వృద్ధుల సహాయార్థం ఏర్పాటు చేసిన 14567 టోల్‌ఫ్రీ నంబరు పనిచేయడం లేదు.

- పోలీసు కుటుంబాలకే రక్షణ కరవు
- ఒంటరి వృద్ధులూ... తస్మాత్ జాగ్రత్త

ఇలా చేస్తే మంచిది

చాలా మంది విశ్రాంత ఉద్యోగులు సంఘాల్లో ఉండటం వల్ల తరచూ సంఘం ప్రతినిధులతో మాట్లాడుతుంటారు. అలాగే ఎవరికైనా సమస్య వస్తే వెంటనే విశ్రాంత ఉద్యోగులు సంఘం సభ్యుల ఇంటికి వెళ్లి వారిని పలకరించి వస్తారు. అవసరమైతే వారిని ఆసుపత్రికి తరలించడం, పిల్లల నుంచి సమస్య వస్తే వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం చేస్తారు. కాబట్టి వృద్ధులంతా ఏదో ఒక సంఘంలో సభ్యులుగా చేరడం, నిత్యం సభ్యులతో మాట్లాడటం, సమావేశాలకు హాజరు కావడం, అందరూ కలసి ఉదయపు నడక, సాయంత్రం సమావేశాలకు వెళ్లడం ఉత్తమం. ఇలా చేయడం వల్ల ఎవరైనా ఒక రోజు కలవకుంటే వారికి సంఘ సభ్యులు ఫోన్ చేసి మాట్లాడటమో, వారి ఇంటికి వెళ్లి చూడటమో చేస్తారు. ఇలా చేయడం వల్ల ఒంటరి వృద్ధులకు రక్షణ ఉంటుంది.

- పిల్లలు ఉద్యోగరీత్య బయట ప్రాంతాలకు వెళ్తారు కాబట్టి చాలా మంది వృద్ధులు తమ స్వగ్రామంలోనే ఉండాలని నిర్ణయించుకుంటారు. అలాంటి సమయంలో ఇంటి చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని వాటిని పర్యవేక్షణ తమ ఇంట్లో ఉంచుకోవడంతో పాటు పిల్లలకు ఇవ్వాలి.

కొన్ని ఉదాహరణలివి

- 2021 నవంబరు 11 కడప ఎన్జీవో కాలనీలో ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళపై దుండగుడు కత్తితో దాడి చేసి బంగారు గొలుసు అపహరించుకెళ్లాడు.
- 2021 సెప్టెంబరు 11న రాయచోటిలో ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళపై ఓ వ్యక్తి దాడి చేసి నాలుగు తులాల బంగారు గొలుసు అపహరించాడు.
- 2021 డిసెంబరు 31న ఓబులవారిపల్లెలో నగల కోసం కన్నతల్లి నర్సమ్మ (56)ను కొడుకు నాగరాజు హత్య చేశాడు. అప్పట్లో ఈ ఘటన జిల్లావ్యాప్తంగా సంచలనం రేపింది.
- 2022 మార్చి 21న ప్రొద్దుటూరులో ఆస్తి కోసం మోషే, సరోజమ్మలను సొంత అన్న హత్య చేశాడు. ఈ జంట హత్యలు అప్పట్లో కలకలం రేపాయి.
- గత నెల 28వతేదీ మదనపల్లె పట్టణంలోని జగన్‌కాలనీకి చెందిన స్వర్ణకుమారి (62)ని ఆమె ఎదురింట్లో ఉండే వెంకటేష్ నగల కోసం తన స్నేహితుడు అనిల్‌తో కలసి దారుణంగా హత్య చేశాడు.

సంఘం ద్వారా బాగోగులు చూస్తాం



ఎవరైనా ఒంటరి వృద్ధులు అనారోగ్యంతో బాధపడుతున్నా, పిల్లల నుంచి దూరంగా ఉండటం వారితో ఇబ్బందులు పడుతున్నా మాకు సమాచారం ఇస్తే ఇంటికి వచ్చి వారికి అవసరమైన సహాయం అందిస్తాం. ఇది వరకు ఓ వృద్ధుడికి కుమారుడు, ముగ్గురు కుమార్తెలున్నా పట్టించుకోకుండా వంటమనిషిని పెట్టి వదిలేశారు. అతను అనారోగ్యంతో బాధపడుతుంటే పిల్లలకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో ఇప్పుడు బాగా చూసుకుంటున్నారు. **- ముని గోపాలకృష్ణ, వయో వృద్ధుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మదనపల్లె**



2022 ఫిబ్రవరి 26న ఇడుపులపాయలో నిర్వహించిన 5వ స్నాతకోత్సవానికి హాజరైన తెలుగు రాష్ట్రాల విద్యార్థులు (పాతచిత్రం)

పట్టాలెక్కని ట్రిపుల్‌ఐటీ స్నాతకోత్సవాలు

- రాష్ట్రవ్యాప్తంగా నాలుగింట ఇదే పరిస్థితి
- 8 వేల మంది విద్యార్థుల ఎదురుచూపు

వేంపల్లె, న్యూస్‌టుడే : రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు రెండేళ్లుగా స్నాతకోత్సవాలు నిర్వహించడం లేదు. దీంతో ఆయా ట్రిపుల్‌ఐటీల్లో ఇంజినీరింగ్ కోర్సు పూర్తి చేసిన 8 వేల మంది విద్యార్థులు డిగ్రీ పట్టాల కోసం ఎదురు చూస్తున్నారు. వర్శిటీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఈ పరిస్థితి తలెత్తింది. నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన సుమారు 24 వేల మంది విద్యార్థులు ఇంజినీరింగ్ విద్య అభ్యసిస్తున్నారు. ఒక్కో ట్రిపుల్‌ఐటీ నుంచి ఏటా వెయ్యి మంది విద్యార్థులు బీటెక్ పూర్తి చేస్తున్నారు. సాధారణంగా నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ఏదో ఒకచోట ఏటా స్నాతకోత్సవం నిర్వహించి సీఎం, గవర్నర్, మంత్రులు, ప్రముఖ విశ్వవిద్యాలయాల అధ్యాపకులను అతిథులుగా ఆహ్వానించి వారి సమక్షంలో విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందిస్తుంటారు. అయితే 2023, 2024 సంవత్సరాలకు సంబంధించి నాలుగు ట్రిపుల్ ఐటీల్లో స్నాతకోత్సవాలు నిర్వహించలేదు. దీంతో 8 వేల మంది విద్యార్థులు డిగ్రీ పట్టాల కోసం ఎదురుచూస్తున్నారు. సాధారణంగా బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులకు ఆ ఏడాదే పట్టాలు అందించాల్సి ఉండగా, రెండేళ్లుగా వర్శిటీ అధికారులు ఆ ఊసే మరిచిపోయారు. స్నాతకోత్సవానికి మంచి వేదిక ఏర్పాటు చేసి విద్యార్థులు, వారి తలిదండ్రులను ఆహ్వానించి ప్రముఖుల సమక్షంలో పండగ వాతావరణంలో డిగ్రీ పట్టాలు అందించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. వర్శిటీ అధికారుల నిర్లక్ష్యంతోనే విద్యార్థులు రెండేళ్లుగా స్నాతకోత్సవానికి దూరమయ్యారు. ఈ విషయమై ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్‌ను వివరణ కోరగా... ట్రిపుల్‌ఐటీలో స్నాతకోత్సవం ఏర్పాటుపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.



అధికారులతో సమావేశమైన కలెక్టర్ శివశంకర్, పక్కన డీఆర్వో గంగాధర్‌గౌడ్

నేటి నుంచి అధికారుల పల్లె బాట

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయిలో సమస్యలను ప్రత్యక్షంగా గుర్తించి, వాటి పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. అందులో భాగంగా ఈ నెల పదో తేదీ నుంచి పల్లెల్లో గ్రామోదయం, పట్టణాల్లో నగరోదయం కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ప్రతి గురువారం మండల ప్రత్యేక అధికారులు ఒక్కో గ్రామ పంచాయతీలో పర్యటిస్తారు. దీనిపై బుధవారం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డీఆర్వో గంగాధర్‌గౌడ్‌లతో కలిసి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి గురువారం ఉదయం ఏడు గంటల్లోపు మండల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శి, గ్రీన్ అంబాసిడర్లతో గ్రామాలను సందర్శించాలని సూచించారు. ఆర్థిక సామాజిక స్థితిగతులు, గ్రామావసరాలను గుర్తించాలన్నారు. సంపద సృష్టి కేంద్రాల సమృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వీటితో పాటు 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పల్లె పండగ వారోత్సవాలను విజయవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. డ్వామా పీడీ విజయకుమార్, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్, హౌసింగ్ పీడీ రాజారత్నం, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మీ, పీఆర్ ఎస్‌ఈ శ్రీనివాసరెడ్డి, జడ్పీ సీఈవో సుధాకర్ రెడ్డి, డీపీవో రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చేనేతకు చేయూత... అతివలకు ఆర్థిక భరోసా

- జిల్లాలో 'స్ఫూర్తి' అమలుకు కసరత్తు
- నేత పనిచేసే వనితలకు రుణాలు

కడప, న్యూస్‌టుడే : అగ్గిపెట్టెలో ఆరు గజాల చీరని అందంగా మడతపెట్టి ఒదిగిపోయేలా ఎంతో చిక్కదనంతో తయారు చేయడంతో అంతర్జాతీయ కీర్తి సొంతం చేసుకున్నారు చేనేత కళాకారులు. పొద్దంతా ఇంటిల్లిపాది శ్రమించినా పూట గడవటం గగనం. ఓర్పు-నేర్పు-కూర్పుతో అందమైన వస్త్రాలు నేసే చేనేత కార్మికుల కళ్లలో నిత్యం కన్నీరే. వేల కుటుంబాల్లో ఆకలి పోగుల కేక ప్రతి ధ్వనిస్తుంది. తరతరాలుగా వారసత్వంగా వస్తున్న చేతివృత్తుల పునరుజ్జీవం దిశగా అడుగులు వేసేలా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. డ్వాక్రా మహిళలను భాగస్వామ్యం చేసి ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలవాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు. అతివల ఉపాధికి భరోసానిచ్చేలా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు.

- జిల్లాలో 26 మండలాల్లో 15 వేల చేనేత కుటుంబాలు ఉన్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా 12 వేల మంది కార్మికులు నేత పనిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. జిల్లాలో మహిళా స్వయం సహాయక సంఘాలు 27,622 ఉంటే సభ్యులుగా 2,82,526 మంది నమోదయ్యారు. నూలు, పట్టు సహకార సంఘాలు 184 ఉండగా సభ్యులు 9,500 మంది ఉన్నారు. వీరిలో వనితలు 45 శాతం ఉంటారని చేనేత, జౌళి శాఖ అధికారులు చెబుతున్నారు.
- కుటుంబ ప్రధాన పోషకుడు ఆరోగ్య సమస్యలతో మంచం పడితే సంసార నావను నడిపించే బాధ్యతను నారీమణులు తన భుజ స్కంధాలపై వేసుకొంటున్నారు. ఆర్థికంగా ఆసరాగా నిలుస్తున్నారు. డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా నమోదైన ఔత్సాహిక మహిళలను గుర్తించి వారికి సాంకేతిక పరంగా శిక్షణ ఇవ్వాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.



కొండమాచుపల్లెలో మగ్గం పని చేస్తున్న సుబ్బమ్మ

స్ఫూర్తి పథకంతో కేంద్రం అండ

చేనేత పనిపై మమేకమైన మహిళల జీవనోపాధికి భరోసా ఇవ్వాలని కేంద్రం ప్రవేశపెట్టిన 'స్ఫూర్తి' పథకాన్ని రాష్ట్రంలో శ్రీకారం చుట్టాలని ప్రణాళికను రూపొందించారు. ఒక్కో జిల్లాలో ఒక క్లస్టర్ ఏర్పాటు చేయనున్నారు. మన జిల్లా చేనేత రంగం విభాగంలో ఎంపికైంది. ఒక్కో సముదాయంలో ఉత్సాహంగా పనిచేయాలని ఆసక్తి చూపే 1,000 నుంచి 1,500 మందిని భాగస్వామ్యం చేయనున్నారు. ఆయా ప్రాంతాల్లో ఉత్పత్తుల సేకరించి, విక్రయించిన తర్వాత వచ్చిన ఆదాయాన్ని సభ్యులకు అందజేయాలని ఉన్నత స్థాయిలో నిర్ణయించారు. 'స్ఫూర్తి' పథకంలో ఒక్కో ప్రాజెక్టు ఏర్పాటు చేయడానికి రూ.అయిదు కోట్లు ఇస్తారు. అందులో కేంద్రం 90 శాతం నిధులిస్తోంది. లబ్ధిదారులు 10 శాతం చెల్లించాల్సి ఉంటుంది. క్షేత్రస్థాయిలో అమలు చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మెప్మా, చేనేత, జౌళి శాఖ అధికారులు ఇప్పటికే సమాచార సేకరణలో నిమగ్నమయ్యారు. విధి విధానాల కోసం అధికార యంత్రాంగం ఎదురుచూస్తోంది.

మైలవరంలో ఏర్పాటుకు మొగ్గు

మైలవరంలో టెక్స్‌టైల్స్ పార్కు ఏర్పాటు చేయాలని 2005 మే 24న నాటి సీఎం వైయస్ రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. సర్వే సంఖ్య 49-1లో 62.78 ఎకరాలను సేకరించారు. అప్పట్లో రూ.7.38 కోట్ల అంచనాలతో శ్రీకారం చుట్టారు. తాగునీరు, భవనాలు, రక్షణగోడ, ఇతర వసతుల కోసం రూ.2.80 కోట్లకు పైగా వెచ్చించారు. ఇక్కడ తొలుత 118 ప్లాట్లు సిద్ధం చేశారు. నాడు ఔత్సాహికులు ఆసక్తి చూపలేదు. ఈ కారణంగా మొన్నటిదాకా ఈ భవనాలు, ఇతర సామగ్రి అంతా నిరుపయోగంగా మారింది. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వినియోగంలోకి తీసుకురావాలని నిర్ణయించారు. ఇందుకోసం అవసరమైన నిధులిచ్చారు. మైలవరం, జమ్మలమడుగు ప్రాంతంలో రెండు వేల మందికి పైగా చేనేత కార్మికులు ఉన్నారు. ఇప్పటికే డీఆర్‌డీఏ ద్వారా ఔత్సాహిక కార్మికులను 1,020 మందిని గుర్తించారు. ఇక్కడ క్లస్టర్ విధానం విజయవంతమైతే ఇతర ప్రాంతాల్లో అమలు చేయాలని ఆలోచనలో అధికారులు ఉన్నారు.

మార్గ దర్శకాలు రాగానే అమలు చేస్తాం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 'స్ఫూర్తి' పథకాన్ని అమలు చేయాలని ఉన్నత స్థాయి నుంచి ఆదేశాలు అందాయి. ఈ మేరకు తొలి విడతలో మైలవరం టెక్స్‌టైల్స్ పార్కులో నూతన క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని కసరత్తు చేస్తున్నాం. ఇప్పటికే నేత పని చేయడానికి ఉత్సాహంగా ముందుకొచ్చిన మహిళా కార్మికులను గుర్తించాం. ఉన్నత స్థాయి నుంచి మార్గదర్శకాలు రాగానే చేనేత, జౌళి శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని పారదర్శకంగా అమలు చేస్తాం. **- ఆనంద్‌నాయక్, పథక సంచాలకులు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ**

చీనీ... కలిసిరాలేదని



యంత్రం సాయంతో చీనీ చెట్లను తొలగిస్తున్న రైతు

చీనీ రైతులను తెగుళ్ల నట్టేట ముంచుతున్నాయి. దిగుబడులు సరిగ్గా రాకపోవడంతో ఆరుగాలం కష్టపడి పెంచిన చెట్లను అన్నదాతలు తొలగించేస్తున్నారు. తొండూరు మండల పరిధిలోని భద్రంపల్లెలో బూచుపల్లె సోమేశ్వర్‌రెడ్డి నాలుగెకరాల్లో 510 చీనీ చెట్లను 14 ఏళ్లుగా పెంచుతున్నారు. ఇటీవల తెగుళ్లు సోకడంతో పలు రకాల మందులు పిచికారీ చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. పెట్టుబడి వ్యయం కూడా పెరిగిపోవడంతో గత్యంతరం లేక చెట్లను యంత్రం సాయంతో తొలగించేస్తున్నారు. అధికారులు తెగుళ్ల నివారణకు సకాలంలో సూచనలివ్వకపోవడంతో చెట్లను తొలగిస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, తొండూరు**

చదివింది డిగ్రీ... చేసేది చోరీ

దొంగ అరెస్టు... బంగారు నగల స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న బాధ్య డీఎస్పీ రమాకాంత్, చిన్నచౌకు సీఐ తేజమూర్తి, ఎస్సై రవికుమార్, సిబ్బంది

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: అతను చదివింది డిగ్రీ.. ప్రైవేటుగా ఎలక్ట్రీషియన్ పనులు చేస్తుండేవాడు. చెడు అలవాట్లకు బానిసయ్యాడు. సులువైన మార్గంలో డబ్బులు సంపాదించాలని చోరీలకు పాల్పడ్డాడు. రెండేళ్లలో 14 దొంగతనాలు చేశాడు. గతంలో అరెస్టు అయి జైలుకెళ్లొచ్చినా అతనిలో మార్పు రాలేదు. తాజాగా చిన్నచౌకు ఠాణా పరిధిలో రెండు నివాసాల్లో చోరీలకు పాల్పడిన కేసులో పోలీసులు అరెస్టు చేశారు. వివరాలను కడప బాధ్య డీఎస్పీ రమాకాంత్ బుధవారం వెల్లడించారు. కడప మోచంపేటకు చెందిన షేక్ అక్బర్ అలీ(26)పై నగరంతో పాటు చెన్నూరు, వల్లూరు ఠాణా పరిధిల్లో పలు చోరీ కేసులు నమోదయ్యాయి. ఈ నెల 5న చిన్నచౌకు పరిధిలోని ఎన్జీవో కాలనీలో ఓ ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళాలు పగులగొట్టి చొరబడి రూ.4.10 లక్షలు విలువ చేసే 83 గ్రాముల బంగారు నగలు ఎత్తుకెళ్లాడు. అలానే 7న ఎన్జీవో కాలనీలో ఒక వృద్ధురాలి ఇంట్లో బంగారు నగలు దొంగిలించాడు. వీటిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, షేక్ అక్బర్ అలీ రింగ్‌రోడ్డులో ఉన్నాడనే సమాచారంతో వెళ్లి అరెస్టు చేశారు. అతని నుంచి రూ.6.5 కిలోలు విలువ చేసే 135 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై అనుమానాస్పద షీటు తెరుస్తామని డీఎస్పీ చెప్పారు. కేవలం మూడు రోజుల్లో కేసును ఛేదించిన సీఐ రవికుమార్, ఎస్సై రవికుమార్, హెచ్‌సీ వేణుగోపాల్, శివకుమార్, కానిస్టేబుళ్లు ఖాదర్ హుస్సేన్, ఓబులేసు, రంతుబాషా, నాగరాజు, గోపాల్, ఉమామహేశ్వరిలను అభినందించారు.

రైలు కిందపడి యువకుడి బలవన్మరణం

ముద్దనూరు న్యూస్‌టుడే : కుటుంబ సమస్యలతో ఓ యువకుడు బుధవారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ముద్దనూరు మండలంలోని చింతకుంటకు చెందిన నాగేంద్ర (24) కొద్దిరోజులుగా కుటుంబ సమస్యలతో పాటు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. దీంతో మద్యానికి బానిసయ్యారు. మంగళవారం రాత్రి చింతకుంట సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు వివరించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

సంతానం కలగడం లేదని యువతి ఆత్మహత్య

మైలవరం, న్యూస్‌టుడే : సంతానం కలగడంలేదని మనస్తాపం చెందిన ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. నంద్యాల జిల్లా అవుకు మండలం నార్గాంపల్లెకు చెందిన దూదేకుల షమీనా (23)కు మైలవరం మండలం నార్జంపల్లెకు చెందిన సుభాన్‌తో నాలుగేళ్ల కిందట వివాహమైంది. షమీనా జమ్మలమడుగులోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. తమకు సంతానం కలగడం లేదని కొద్దిరోజులుగా షమీనా బాధపడుతుండేవారు. ఈ నేపథ్యంలో బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆమె ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అనుమానాస్పద మృతిపై కేసు నమోదు

కాశినాయన, (పోరుమామిళ్ల) న్యూస్‌టుడే : పోరుమామిళ్ల పట్టణంలోని మహబూబ్‌నగర్ కాలనీకి చెందిన శ్రీనివాసులు (57) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్.ఐ కొండారెడ్డి తెలిపారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా శ్రీనివాసులు భార్య వనిత తన ఇద్దరు పిల్లలతో కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. మూడు రోజులుగా ఆయన ఉండే వాకిలి పని చేయకపోవడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు బుధవారం ఇంట్లోకి వెళ్లి చూడగా శ్రీనివాసులు మృతి చెంది ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు.

పెన్నాలో యువకుడి గల్లంతు

సిద్దవటం, న్యూస్‌టుడే : సిద్దవటం వద్ద పెన్నానదిలో మునిగి యువకుడు గల్లంతయ్యారు. కడపలోని బీడీ కాలనీకి చెందిన జేమ్స్ (28), తన స్నేహితులు ప్రశాంత్, సుధాకర్, రామయ్యలతో కలిసి బుధవారం మధ్యాహ్నం పెన్నానది వద్దకు వచ్చారు. బహిర్భూమికి వెళ్లి వస్తానని స్నేహితులతో చెప్పిన జేమ్స్ నదిలోకి దిగి గల్లంతయ్యారు. ఈ ఘటనను గమనించిన స్నేహితులు.... అతని కుటుంబ సభ్యులకు సమాచారం తెలిపారు. వారు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఒంటిమిట్ట సీఐ కృష్ణంరాజు నాయక్, సిద్దవటం పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి వరకు యువకుడి ఆచూకీ లభ్యం కాలేదు.

మద్యం దుకాణాలకు 2,200 దరఖాస్తులు

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేయనున్న 139 మద్యం దుకాణాలకు ఈ నెల 11 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని కడప ఎక్సైజ్ పర్యవేక్షణాధికారి రవికుమార్ బుధవారం తెలిపారు. ఇప్పటి వరకు 2200 దరఖాస్తులొచ్చాయని చెప్పారు. 14వ తేదీ ఉదయం 8 గంటలకు జడ్పీ సమావేశ మందిరంలో కలెక్టరు సమక్షంలో లాటరీ ద్వారా కేటాయిస్తామన్నారు. 16వ తేదీ దుకాణాలు పని చేస్తాయని తెలిపారు. దరఖాస్తుదారులకు ఏవైనా సందేహాలుంటే అధికారులను సంప్రదించాలన్నారు. జిల్లాలో ఎక్కడ నుంచైనా ఏ దుకాణానికైనా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. దరఖాస్తుదారులు 14వ తేదీ ఉదయం 7 గంటల కల్లా కడప జడ్పీ సమావేశ మందిరం వద్దకు గుర్తింపుకార్డుతో రావాలని చెప్పారు.

ప్రతిభకు ఉపకారం... భవితకు సోపానం

న్యూస్‌టుడే, కడప విద్య

ఎన్ఎంఎంఎస్ పరీక్ష దరఖాస్తులకు 15వ తేదీ వరకు గడువు

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్రప్రభుత్వం ఏటా ప్రతిభా ఉపకార వేతన పరీక్ష (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ - ఎన్ఎంఎంఎస్) నిర్వహిస్తోంది. ఈ ఏడాదికి సంబంధించి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ కాగా దరఖాస్తుకు అక్టోబరు 15వ తేదీ వరకు గడువు ఉంది. www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. డిసెంబరు 8న ఈ పరీక్ష నిర్దేశిత కేంద్రాల్లో జరగనుంది.

ఏడాదికి రూ.12 వేలు

ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న బాల, బాలికలు ఈ పరీక్షకు అర్హులు. ఎంపికైన వారికి 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం వరకూ ఏడాదికి రూ.12 వేలు చొప్పున ఉపకార వేతనాలను కేంద్రప్రభుత్వం అందజేస్తోంది. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులు సుమారు 12 వేల మందికిపైన ఉండగా, దరఖాస్తు చేసుకుంటున్న వారు 2 వేలు మాత్రమే ఉంటున్నారు. అర్హత సాధించిన వారు సుమారు 200కు మించడం లేదు. ఎక్కువ మంది విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా విద్యాశాఖ, ఉపాధ్యాయ వర్గాలు ప్రణాళిక రూపొందించుకోవాల్సి ఉంది. పరీక్ష రాసే వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే చాలామంది ఎంపికయ్యే అవకాశముంది. ఈ ఏడాది ఇప్పటివరకూ 2,244 మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు.

విద్యాసంవత్సరం	పరీక్ష రాసినవారు	ఎంపికైనవారు
2020 – 21	3,100	163
2021 – 22	2,356	235
2022 – 23	2,366	157

ఇవీ అర్హతలు

- 7వ తరగతిలో 55 శాతం మార్కులు సాధించి ఉండాలి.
- తుది ఎంపిక సమయం నాటికి 8వ తరగతిలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొంది ఉండాలి.
- ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 50 శాతం మార్కులు సాధిస్తే చాలు
- ప్రభుత్వ, మున్సిపల్, జడ్పీ, ఎయిడెడ్ పాఠశాలల్లో రెగ్యులర్ విధానంలో చదివిన వారు మాత్రమే దరఖాస్తు చేయాలి.
- విద్యార్థి తల్లిదండ్రుల కుటుంబ వార్షికాదాయం రూ.3.50 లక్షలకు మించకూడదు.
- రాత పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారు.


కడప నగరపాలక ప్రధాన ఉన్నత పాఠశాలలో విద్యార్థులు

పరీక్ష విధానం ఇలా...

ఇందులో 90 బహుళైచ్ఛిక(మల్టిపుల్ ఛాయిస్) ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం 90 మార్కులు కేటాయిస్తారు. తప్పిదాలకు మైనస్ (నెగిటివ్) మార్కులు ఉండవు.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

అర్హులైన ప్రతి ఒక్కరూ ఎన్ఎంఎంఎస్‌కు దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నాం. ఉన్నత చదువులు అభ్యసించాలనే ఆశయం ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రతిభావంతులైన అందరూ పరీక్ష రాసేలా చూస్తాం. - **అనురాధ, జిల్లా విద్యాశాఖాధికారి**

నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్

హెడ్‌కానిస్టేబుల్‌తో సహా ముగ్గురిపై కేసు నమోదు

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలో నకిలీ పత్రాలు సృష్టించి భూములను రిజిస్ట్రేషన్ చేస్తున్న వ్యవహారంపై కలెక్టరు కన్నెర్ర చేశారు. ఈ నేపథ్యంలో పలు చోట్ల కేసులు నమోదు చేస్తున్నారు. తాజాగా కడప తాలూకా ఠాణా పరిధిలో తప్పుడు రిజిస్ట్రేషన్‌కు పాల్పడిన కడప తాలూకా ఠాణా హెడ్‌కానిస్టేబుల్ వి.ఎం.బాషాతో పాటు బొమ్మిశెట్టి రామకృష్ణ, రామాంజనేయరెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు తాలూకా పోలీసులు తెలిపారు. నెల్లూరుకు చెందిన శివకృష్ణ కడప అక్కాయపల్లెలోని పొలం సర్వే నంబరు 47-1లో 15 సెంట్లు కొన్నారు. ఈ నేపథ్యంలో అదే స్థలాన్ని హెడ్‌కానిస్టేబుల్ బాషాతో పాటు బొమ్మిశెట్టి రామకృష్ణ, రామాంజనేయరెడ్డిలు తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. తర్వాత ఆ భూమి తమదేనంటూ శివకృష్ణను బెదిరించారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా ముగ్గురిపై కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ బాషాపై గతంలో కూడా రెండు కేసులు ఉండడం గమనార్హం.

యజమానులకు కార్లు అప్పగింత

స్పందనకు వందనం

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: పోలీసులు జప్తు చేసిన కార్లను వాటి యజమానులకు సొంత పూచీకత్తుతో అప్పగిస్తున్నారు. ఈ వ్యవహారంపై 'ఈనాడు'లో బుధవారం 'పోలీసులు ఇస్తారా.. కోర్టుకు అప్పగిస్తారా' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా పోలీసు అధికారి హర్షవర్ధన్ రాజు స్పందించారు. యజమానుల నుంచి స్టాంప్ పేపర్లపై రాయించుకొని, సంబంధిత పత్రాలను తీసుకుని అప్పగించాలని బాధ్య డీఎస్పీ రమాకాంత్, తాలూకా సీఐ వెంకటేశ్వర్లను ఆదేశించారు. కేసు ముగిసేంత వరకు కార్లను విక్రయించడం లాంటివి చేయకూడదని పోలీసులు చెప్పారు. మొత్తం 36 వాహనాలను యజమానులకు అప్పగించనున్నారు.

గాలేరు-నగరి కాలువ నుంచి నీటి విడుదల


నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి, పుత్తా నరసింహారెడ్డి తదితరులు

వీరపునాయునిపల్లె, న్యూస్‌టుడే: గాలేరు-నగరి సుజల స్రవంతి కాలువ నుంచి నియోజకవర్గంలో సాగు, తాగు అవసరాలకు డైవర్షన్ కాలువ ద్వారా బుధవారం కలెక్టర్ శివశంకర్‌తో కలిసి ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, తెదేపా రాష్ట్రకార్యదర్శి పుత్తా నరసింహారెడ్డిలు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన తండ్రి నరసింహారెడ్డి 2009 నుంచి నియోజకవర్గంలో ఎలాంటి చర్యలు చేపడితే రైతులకు మేలు కలుగుతుందని పరిశీలించారని, ఆయన ఆధ్యయనంతో మరోసారి సర్వేచేయించి గాలేరు నగరి కాలువ నుంచి గ్రావిటీ ప్రకారం నీటిని పంపిస్తే దాదాపు 15వేల ఎకరాలకు నీరు అందించవచ్చని గుర్తించామని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని కలెక్టర్, సాగునీటిశాఖ అధికారులతో చర్చించామన్నారు. వెంటనే స్పందించి రూ.2 కోట్లతో ప్రణాళిక రూపొందించారని చెప్పారు. కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ గాలేరునగరి నుంచి 12 కిలోమీటర్లు ప్రయాణించి పాపాఘ్ని వద్ద కలుస్తుందని, అక్కడినుంచి మరో మూడు కిలోమీటర్లు ప్రయాణించి పాపాఘ్ని నదికి చేరుతుందని తెలిపారు. దీంతో నాలుగు మండలాల ప్రజలకు సాగునీటి ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. పుత్తా నరసింహారెడ్డి మాట్లాడుతూ కాలువలో నీరు నిల్వ ఉండడంతో ఎలాంటి ప్రయోజనం లేదని గ్రహించి, వాటిని గ్రావిటీ ప్రకారం పంపగలిగితే సాగుకు అందించవచ్చని అధ్యయనం చేశామని, ఈ రోజు ఆ కల నిజమైందని ఆనందం వ్యక్తం చేశారు. సాగునీటి శాఖ అధికారులు, పులివెందుల ఆర్డీవో అన్నపూర్ణ ప్రత్యూష, వీఎన్‌పల్లె తహసీల్దార్ లక్ష్మీదేవి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి అటవీభూమి కేటాయించాలని వినతి

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే: వైయస్ఆర్ జిల్లా కాశినాయన మండలంలోని కాశినాయన క్షేత్రంలో ఆలయ నిర్మాణానికి 15 ఎకరాల అటవీ స్థలాన్ని కేటాయించాలని కేంద్ర అటవీశాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌ను బుధవారం దిల్లీలో రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి దృష్టికి పలు విషయాలు తీసుకెళ్లారు. ఆలయ అభివృద్ధి పనులను అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని, దీంతో భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. ఆలయ నిర్మాణానికి 15 ఎకరాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. త్వరలో కాశినాయన భక్తులకు శుభవార్త అందుతుందని మంత్రి సత్యకుమార్ తెలిపినట్టు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్ పేర్కొన్నారు.


కేంద్ర అటవీశాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌ను కలిసిన వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున

కడప విద్య, న్యూస్‌టుడే : ప్రభుత్వం 12వ పీఆర్సీ అమలుచేయడానికి ఆలస్యమవుతున్నందున దసరా కానుకగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతరభృతి ప్రకటించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున కోరారు. స్థానిక సంఘం కార్యాలయంలో బుధవారం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. శివార్జున మాట్లాడుతూ గత ప్రభుత్వం 11వ పీఆర్సీ లో ఉద్యోగ, ఉపాధ్యాయులకు రివర్స్ పీఆర్సీ ఇచ్చి తీవ్రంగా నష్టపరిచిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం 12వ పీఆర్సీ లో మంచి ఫిట్‌మెంట్ ఇచ్చి ఉద్యోగులను ఆదుకోవాలని, పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలను వెంటనే మంజూరు చేయాలని సూచించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాజు మాట్లాడుతూ జీవో 117ను వెంటనే రద్దు చేయాలన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శేషగిరిరావు, జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌బాబు, కార్యదర్శులు కట్టా గంగాధర్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

రాములోరి సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు


తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ లక్ష్మీనారాయణ, జస్టిస్ లక్ష్మణ్‌లకు వేదాశ్వీరాదం చేస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట కోదండ రాముల యాన్ని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ లక్ష్మీనారాయణ, జస్టిస్ లక్ష్మణ్ బుధవారం సందర్శించారు. రాములోరి సన్నిధికి వచ్చిన న్యాయమూర్తులకు తితిదే అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కల్యాణ మండపంలో సీతారామలక్ష్మణ బాలమూర్తులను దర్శించారు. రామయ్య క్షేత్రం చారిత్రక వైభవం, ప్రాశస్త్యాన్ని అర్చకులు శ్రావణ్‌కుమార్, పవన్ కుమార్ వివరించారు. అనంతరం వేదాశ్వీరాదం చేశారు. న్యాయమూర్తులను పర్యవేక్షకుడు హనుమంతయ్య సత్కరించారు.

ఇద్దరికి రైతు నేస్తం పురస్కారాలు

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే : ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె పంచాయతీ అమృతనగర్‌కు చెందిన బొమ్మిశెట్టి భానుమతి, కల్లూరు వి.అభిషేకంకు రైతు నేస్తం పురస్కారాలు లభించాయి. ఈ ఏడాదికి తెలుగు రాష్ట్రాల నుంచి 20 మంది రైతులను ఎంపిక చేశారు. ఇందులో తమ పేర్లు ఉన్నందుకు ఆనందంగా ఉందని, ఈ నెల 20న కృష్ణా జిల్లా గన్నవరం స్వర్ణభారత్ ట్రస్టు కార్యాలయంలో నిర్వహించే పురస్కారాల ప్రదానోత్సవంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా పురస్కారం అందుకుంటామని తెలిపారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు భూముల పరిశీలన

కొండాపురం, న్యూస్‌టుడే : మండలంలోని కె.బొమ్మేపల్లె పరిధిలో హైడ్రో పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు బుధవారం జేసీ అదితిసింగ్ భూములు పరిశీలించారు. జమ్మలమడుగు ఆర్డీవో ఆదిమూలం సాయిశ్రీతో కలిసి భూములను పరిశీలించారు. అదానీ గ్రూప్ ఆధ్వర్యంలో వెయ్యి మెగావాట్ల హైడ్రో పవర్ ప్రాజెక్టు కోసం భూములను పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. కొండాపురం ఇన్‌ఛార్జి తహసీల్దారు మీనా, ఆర్ఐ మహేశ్వరరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సెయిల్ ఆధ్వర్యంలో కడప ఉక్కు పరిశ్రమ నిర్మించాలి

కడప విద్య, న్యూస్‌టుడే : విభజన చట్ట ప్రకారం జిల్లాలో ఏర్పాటుచేయాల్సిన ఉక్కు పరిశ్రమను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సెయిల్ ఆధ్వర్యంలో నిర్మించి, నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుందరరామరాజు డిమాండ్‌చేశారు. స్థానిక కార్యాలయంలో బుధవారం రాయలసీమ జిల్లాల వర్క్‌షాప్ నిర్వహించారు. సుందరరామరాజు మాట్లాడుతూ ప్రతిసారి ఎన్నికల సమయంలో మాత్రమే ఉక్కు పరిశ్రమ నిర్మిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే విస్మరిస్తున్నారని విమర్శించారు. రాయలసీమ వాసులే ముఖ్యమంత్రులు అయినా పరిశ్రమలు స్థాపించడంలో ఘోరంగా విఫలమవుతున్నారని ఆరోపించారు. కొప్పర్తి పారిశ్రామికవాడ నుంచి ఎంఎస్ఎంఈ సెంటర్‌ను అమరావతికి తరలించడం తగదన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు బీరం సుభాష్‌చంద్రరెడ్డి, రాయలసీమ కన్వీనర్ జయవర్ధన్, నాయకులు సుబ్బమ్మ, ప్రదీప్‌రెడ్డి, పృథ్వీ, పోతులయ్య, రాజేంద్ర, అజ్మతుల్లా, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

వాహన్ సాఫ్ట్‌వేర్‌పై అవగాహన

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే: కడప జోన్ పరిధిలోని రవాణాశాఖ అధికారులు వాహన్ సాఫ్ట్‌వేర్‌పై అవగాహన కలిగి ఉండాలని జేటీసీ కృష్ణవేణి పేర్కొన్నారు. కడప శివారులోని డీటీసీ కార్యాలయంలో బుధవారం ఎనిమిది జిల్లాల డీటీసీలు, ఆర్టీవోలు, బ్రేక్ ఇన్‌స్పెక్టర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తగా వచ్చిన సాఫ్ట్‌వేర్‌ను ఎలా ఉపయోగించాలి, అందులోని లోపాలు తదితర వాటిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కృష్ణవేణి మాట్లాడుతూ 'వాహన్'తో దేశంలో ఎక్కడ కొనుగోలు చేశారు, కేసులు తదితర అంశాలను తెలుసుకునే అవకాశం ఏర్పడిందని చెప్పారు. డీటీసీలు చంద్రశేఖర్‌రెడ్డి(కడప), శాంతకుమారి(కర్నూలు), వీర్రాజు(అనంతపురం), నిరంజన్ రెడ్డి(చిత్తూరు), ఆర్టీవోలు, బ్రేక్‌ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది ఉన్నారు.


జేటీసీ కృష్ణవేణిని సన్మానిస్తున్న కడప డీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, చిత్రంలో రవాణాశాఖ అధికారులు

మైలవరం జలాశయం నుంచి నీటి విడుదల

మైలవరం, న్యూస్‌టుడే : మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి 2,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు డీఈఈ ఆనంద నరసింహమూర్తి బుధవారం తెలిపారు. మైలవరం జలాశయం ఉత్తర కాలువకు 110, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల నీరు వెళుతున్నట్లు వివరించారు. గండికోట జలాశయం నుంచి మైలవరం జలాశయానికి 5 వేల క్యూసెక్కుల నీరు వస్తున్నట్లు పేర్కొన్నారు.

జిల్లాలో డ్రోన్ సేవలు విస్తృతం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : జిల్లాలో డ్రోన్ సేవలు విస్తృతం చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో డ్రోన్ సేవల వినియోగంపై బుధవారం సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆధునిక యుగంలో అన్ని రంగాల్లో డ్రోన్ సేవలు కీలకంగా మారుతున్నాయన్నారు. భూముల సర్వే, వ్యవసాయం, అనుబంధ రంగాలు, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, అటవీ, గనులు, పురపాలక శాఖల్లో వీటిని వినియోగించాలని సూచించారు. దీనిపై జిల్లాలోని యువతకు శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇంటర్ విద్యార్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డ్రోన్ వినియోగంపై ఆయా సంస్థల ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అందించారు. వ్యవసాయశాఖ ఏడీ నాగేశ్వరరావు, డ్వామా పీడీ విజయ్‌కుమార్, కార్పొరేషన్ అదనపు కమిషనర్ రాకేష్, డీఈవో సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందాలి

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: పిల్లల్లో సృజనాత్మక ఆలోచనలు పెంపొందడానికి స్పేస్ వీక్-2024 లాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. ఇస్రో, కేఎస్ఆర్ఎం విద్యా సంస్థలు సంయుక్త ఆధ్వర్యంలో మూడురోజులు ఏర్పాటు చేసిన 'ఇస్రో స్పేస్ వీక్-2024' ముగింపు కార్యక్రమానికి బుధవారం కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సరికొత్త ఆలోచనలు.. శాస్త్ర సాంకేతికత పురోభివృద్ధి, పరిణామాలకు నాంది పలుకుతాయన్నారు. షార్ డిప్యూటీ డైరెక్టర్ రమేష్‌బాబు, ఏపీపీబీ జోనల్ ఆఫీసరు ఎస్ఎన్ మురళి, షార్ ఎస్డీఎస్సీ జీఎం వి.కృతివాసన్‌లు కార్యక్రమ వివరాలను వెల్లడించారు. వివిధ అంశాల్లో జరిగిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కలెక్టర్ జ్ఞాపికలు, ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ వీఎస్ఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపల్ టీఎన్ ప్రసాద్, వీరశంకర్, సురేష్‌బాబు, సభ్యులు పాల్గొన్నారు.



విజేతలతో కలెక్టర్ శివశంకర్ లోతేటి, పక్కన ఇస్రో ప్రతినిధులు

విప్లవ కెరటం చెగువేరా



చెగువేరాకు నివాళులర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

మారుతీనగర్, న్యూస్‌టుడే: ఎగిసే విప్లవ కెరటం చెగువేరాను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన స్ఫూర్తితో విభజన హామీల అమలు కోసం, కడప ఉక్కు పరిశ్రమ కోసం యువతతో కలిసి పోరాడతామని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ తెలిపారు. చెగువేరా వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రెబ్బా నరసింహులు, నగర కన్వీనర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కడప విద్య : చెగువేరా నేటి ప్రపంచంలోని యువతకు ఆదర్శంగా నిలుస్తారని, ఆయన ఆశయ సాధనకు అందరం కృషిచేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న అన్నారు. స్థానిక సంఘం కార్యాలయంలో బుధవారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ), ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) ఆధ్వర్యంలో చేగువేరా వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు.

కడప చిన్నచౌకు: అసమానతలు, అన్యాయాలపై పోరాడి ప్రజల కోసం ప్రాణాలర్పించిన త్యాగధనుడు, విప్లవ కెరటం చెగువేరా అని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేసు అన్నారు. చేగువేరా వర్ధంతి సందర్భంగా బుధవారం కడపలోని కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్రొద్దుటూరు
• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

జాతీయ వర్సిటీ ఖోఖో పోటీలకు విద్యార్థిని ఎంపిక


లావణ్యను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

ప్రొద్దుటూరు గ్రామీణ : నెల్లూరులోని ఎన్‌బీకేఆర్ కళాశాలలో ఈ నెల 8న జరిగిన సౌత్ జోన్ యూనివర్సిటీ క్రీడల్లో భాగంగా నిర్వహించిన ఖోఖో పోటీల్లో తమ కళాశాల విద్యార్థిని లావణ్య ప్రతిభ కనబరచినట్లు గౌతమి మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ రామసుబ్బమ్మ బుధవారం తెలిపారు. డిసెంబరులో కేరళలో జరగనున్న జాతీయ సౌత్ వర్సిటీ క్రీడలకు సంబంధించి ఖోఖో పోటీల్లో ఆమె పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా లావణ్యను కళాశాల ప్రతినిధులు అభినందించారు.

సమస్యల పరిష్కారానికి వినతి


డాక్టర్ రఫీక్‌పాషాకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జమ్మలమడుగు సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు దాసు, విజయ్ కోరారు. బుధవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఫీక్‌పాషాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులకు ప్రతి నెలా సక్రమంగా జీతాలు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెండు వారాల్లో సమస్య పరిష్కారం కాకుంటే ఆసుపత్రి ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. నాయకులు శేఖర్, స్వామి, భీమా పాల్గొన్నారు.

భర్త వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

జిల్లెల్ల(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: భర్త వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు నంద్యాల జిల్లా బనగానపల్లి మండలంలోని నందివర్గం పోలీసులు తెలిపారు. జమ్మలమడుగుకు చెందిన శకుంతల (36)కు బనగానపల్లి మండలం జిల్లెల్లాకు చెందిన బలరాముడితో 17 ఏళ్ల కిందట వివాహమైంది. భర్త వేధింపులు తాళలేక మంగళవారం రాత్రి శకుంతల ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు నందివర్గం పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీసీ రోడ్డు ధ్వంసంపై ఫిర్యాదు

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే : మండల పరిధి చౌడూరు ఎస్సీ కాలనీలో స్థానిక నాయకుడు తన ఇంటికి కుళాయి కనెక్షన్ కోసం సీసీ రోడ్డును పగులగొట్టి మరమ్మతులు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు బుధవారం తహసీల్దారు, వీఆర్వోకు ఫిర్యాదు చేశారు. తమ ఇళ్లకు వెళ్లాలంటే అసౌకర్యంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీరోడ్డుకు మరమ్మతులు చేయించాలని ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా బదులిస్తున్నట్లు పేర్కొన్నారు. విచారణ చేపట్టి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరారు.

వనం-మనం మొక్కలు సిద్ధం

పచ్చదనం పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే : మానవాళి మనుగడకు మొక్కలే కీలకం. వాతావరణంలో సమతుల్యత లోపించడంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. భూతాపం పెరిగి, పచ్చదనం కనుమరుగవుతోంది. దీంతో పచ్చదనాన్ని పెంపొందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రొద్దుటూరు సబ్ డివిజనల్ అటవీ అధికారి ఎన్.వి.దివాకర్ చొరవతో 'వనం-మనం' కార్యక్రమాన్ని చేపడుతున్నారు. మొక్కలు నాటి సంరక్షించాల్సిన బాధ్యత అటవీ శాఖ అధికారులదే అని అనుకోకుండా ప్రతి ఒక్కరూ తమకు విధిగా మొక్కలు సంరక్షించాలి. అందరూ ముందుకొచ్చి ఖాళీ స్థలాలు, రోడ్డుకు ఇరువైపులా, పొలాల గట్లపైన, ఇంటి ఆవరణలో మొక్కలు నాటితే పచ్చదనం పెంపొందుతుంది. కార్తిక పౌర్ణమి వరకు అధికారులు ఈ కార్యక్రమాన్ని కొనసాగించనున్నారు.

● ప్రొద్దుటూరు సబ్ డివిజన్ అటవీ శాఖలో వనిపెంట, పోరుమామిళ్ల, ముద్దనూరు, ప్రొద్దుటూరు రేంజ్‌లున్నాయి. పోరుమామిళ్ల-3, వనిపెంట-1, ముద్దనూరు-2 నర్సరీలున్నాయి. వీటి పరిధిలో 4.34 లక్షలు మొక్కలు అందుబాటులో ఉన్నాయి. డివిజన్ పరిధిలో 'వనం-మనం' కింద 3,59,700, అమ్మ పేరు మీద(ఏక్ పేడ్ మా కే నామ్) 1,050 మొక్కలు నాటాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు, కార్యాలయాలు, ఇంటి ప్రాంగణాల్లో వీటిని నాటనున్నారు.

● రైతులు తమ పాసుపుస్తకం, ఇతరులు ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలు తీసుకొస్తే ఉచితంగా మొక్కలు పంపిణీ చేయనున్నారు. వీటిలో కొన్ని మొక్కలను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు విక్రయిస్తారు. పచ్చదనం పెంపొందించడంతో కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. నెమలినార, నిద్రగన్నేరు, పచ్చతురాయి, మోదుగ, అల్లనేరెడు, గోరింట, రావి, నెరేడు, కానుగ, వేప, విప్ప, నారవేప, ఉసరి, మారేడు, చింత, సీతాఫలం, మునగ, వెలగ తదితర మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి.

● కలప, ఎర్రచందనం, భూములు, వన్యప్రాణుల సంరక్షణకు టాస్కుఫోర్సు, స్ట్రైకింగ్ ఫోర్సు బేస్ క్యాంపు ఎఫ్‌బీవోలు, ఏబీవోలు, ప్రొటెక్షన్ వాచర్లు రాత్రి వేళల్లో గస్తీ తిరుగుతుంటారన్నారు.


ప్రొద్దుటూరులోని నర్సరీలో పంపిణీకి సిద్ధంగా ఉన్న మొక్కలు

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ

పెద్దముడియం, న్యూస్‌టుడే : పెద్దముడియం నూతన తహసీల్దారుగా బాల నరసింహులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన కాశినాయన మండలంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేసిన వెంకటసుబ్బయ్య కాశినాయన మండలానికి బదిలీపై వెళ్లారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దారు బాలనరసింహులు తెలిపారు.

కలసపాడు : కలసపాడు తహసీల్దారుగా మధురవాణి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె దువ్వూరులో తహసీల్దారుగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆర్ఐ చంద్రశేఖర్, రెవెన్యూ సిబ్బంది నూతన తహసీల్దారుకు స్వాగతం పలికారు.

ఖాజీపేట : ఖాజీపేట మండల తహసీల్దారుగా మహబూబ్‌బాషా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండల పరిధిలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. కలసపాడు నుంచి ఆయన బదిలీపై ఖాజీపేటకు వచ్చారు.

హెచ్‌ఆర్‌ఈ సెల్ ఛైర్మన్‌గా ప్రతాప్‌కుమార్

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే : ప్రొద్దుటూరు నియోజకవర్గం హ్యూమన్ రైట్స్ ఎడ్యుకేషన్ సెల్ ఛైర్మన్‌గా డాక్టర్ ఆరికొండ ప్రతాప్‌కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మానవ హక్కులు, విద్యా పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

22 మందికి ధ్రువపత్రాల అందజేత

మైదుకూరు, న్యూస్‌టుడే : పీఎం విశ్వకర్మ పథకం ద్వారా చేతివృత్తిలో శిక్షణ పూర్తి చేసుకున్న 22 మంది తాపీ మేస్త్రీలకు బుధవారం మైదుకూరులోని పీఎం విశ్వకర్మ కార్యాలయంలో అధికారులు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కేకు కోసి కత్తిరించి సంబరాలు చేసుకున్నారు.

బాధిత కుటుంబానికి రూ.85 లక్షల చెక్కు అందజేత


నారమ్మకు చెక్కు అందజేస్తున్న ఎస్‌బీఐ రీజినల్ మేనేజరు శ్రీవాణి కిశోర్‌రెడ్డి

జమ్మలమడుగు, న్యూస్‌టుడే : నందలూరు పరిధిలోని ఆల్విన్ కర్మాగారం సమీపంలో జులై 14న ఆర్టీసీ బస్సును లారీ ఢీకొన్న సంఘటనలో జమ్మలమడుగు మండలం మోరగుడికి చెందిన కండక్టర్ సీజే రాముడు మృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్‌బీఐ అధికారులు ప్రమాద బీమా క్లెయిమ్ పథకం ద్వారా రాముడి భార్య సీజే నారమ్మకు రూ. 85 లక్షల విలువైన చెక్కును అందజేశారు. బుధవారం స్థానిక ఎస్‌బీఐ ప్రధానశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎస్‌బీఐ రీజినల్ మేనేజరు శ్రీవాణి కిశోర్‌రెడ్డి విచ్చేసి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజరు కిరణ్‌కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

రాయితీ శనగ విత్తనాల పంపిణీ


రైతులకు శనగ విత్తనాలు అందజేస్తున్న భూపేష్‌రెడ్డి, నాయకులు

కొండాపురం, న్యూస్‌టుడే : ప్రభుత్వం రాయితీతో అందిస్తున్న శనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెదేపా జమ్మలమడుగు ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి, భాజపా నాయకుడు శశినారాయణరెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని పొట్టిపాడులో రాయితీ శనగ విత్తనాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. మండలానికి 3,042 క్వింటాళ్ల శనగలు మంజూరయ్యాయని ఏవో రామాంజులరెడ్డి తెలిపారు. అదనంగా మరో 500 నుంచి 800 క్వింటాళ్ల శనగలు అవసరం ఉంటుందని ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నట్లు తెలిపారు. ఏడీఏ వెంకటసుబ్బయ్య, నాయకులు నాగేశ్వరరెడ్డి, రామచంద్రారెడ్డి, గోపి నరసింహారెడ్డి, శంకర్‌రెడ్డి, బాబురెడ్డి, నరసింహారెడ్డి, నారాయణరెడ్డి, నాగిరెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదిని విమర్శిస్తే ఊరుకోం

జమ్మలమడుగు, న్యూస్‌టుడే : నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిని విమర్శించే నైతిక హక్కు ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డికి లేదని తెదేపా నియోజకవర్గ బాధ్యుడు భూపేష్‌రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక తెదేపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి చేసే వ్యక్తిని విమర్శిస్తే ఊరుకోబోమన్నారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి గతంలో విమర్శిస్తే ఎందుకు ప్రశ్నించలేదన్నారు. జమ్మలమడుగు, ఎర్రగుంట్లలో అన్న క్యాంటీన్ ఏర్పాటు, నియోజకవర్గానికి మొదటి దశలో అభివృద్ధి పనులకు రూ. 16 కోట్ల నిధులు తీసుకొచ్చామని, అవి ఆయనకు కనిపించడం లేదా అని నిలదీశారు. కార్యకర్తల కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం దేవగుడి కుటుంబం ఎప్పుడూ ముందుంటుందన్నారు. మీలో మీకు సఖ్యత లేకనే జమ్మలమడుగులో రెండు వైకాపా కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నారని విమర్శించారు. నాయకులు జంబాపురం రమణారెడ్డి, దేవగుడి యూత్ నాగేశ్వరరెడ్డి, గోన పురుషోత్తం రెడ్డి, పొన్నతో శ్రీను, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ అధికారులకు నోటీసులు

బద్వేలు, న్యూస్‌టుడే : బద్వేలు పురపాలక తాగునీటి సరఫరా పనుల్లో జరిగిన అక్రమాలపై ఈఎన్‌సీ అధికారులు బద్వేలు ఇంజినీరింగ్ విభాగానికి షాకిచ్చారు. గతేడాది డిసెంబరు అయిదున తాగునీటి సరఫరా పనుల్లో అక్రమాలపై పలువురు చేసిన ఫిర్యాదుపై స్పందించిన ఈఎన్‌సీ అధికారులు పనుల నాణ్యతను పరిశీలించారు. తాగునీటి సరఫరా పనుల్లో నాణ్యత లోపాలను గుర్తించిన అధికారులు బుధవారం పురపాలక పని చేసిన ఇద్దరు ఈఈలు శివనాగేంద్ర, మహేష్‌బాబు, ఇద్దరు డీఈఇలు గురప్ప యాదవ్, తులసీ కుమార్‌తో పాటు అకౌంట్ విభాగానికి చెందిన జ్యోతి, గోవిందనాయక్‌లకు నోటీసులు జారీ చేశారు. 15 రోజుల్లోగా విచారణకు హాజరై సమాధానమివ్వాలని లేనిపక్షంలో తామే విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో పేర్కొన్నారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ

బ్రహ్మంగారిమఠం : స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ సగిలి రవిబాబు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన 26 మంది గర్భిణులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు.

ఆధార్ నమోదుకు ప్రత్యేక మేళా నేడు

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే : జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆధార్ నమోదుకు ప్రత్యేక మేళా నిర్వహిస్తున్నట్లు ప్రొద్దుటూరు పోస్టల్ సూపరిండెంటెండ్ కిరణ్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ అజీజ్ తెలిపారు. ప్రొద్దుటూరు, పులివెందుల పట్టణ ప్రధాన తపాలా కార్యాలయాలతో పాటు హోమస్‌పేట, మైదుకూరు తపాలా కార్యాలయాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఎలాంటి రుసుం లేకుండా కొత్తగా ఆధార్ నమోదుకు అవకాశం కల్పించామన్నారు.

హరియాణాలో విజయంపై భాజపా సంబరాలు

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే : హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా ఘనవిజయం సాధించడంపై స్థానిక పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు బుధవారం సంబరాలు చేసుకున్నారు. బాణసంచా పేల్చి మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా భాజపా జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పాలనతో దేశ వ్యాప్తంగా ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, రమణయ్య, భాస్కర్‌రెడ్డి, సంజీవరెడ్డి, నాగిరెడ్డి, గురుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నామమాత్రంగా మండల సమావేశం

ఖాజీపేట : ఖాజీపేటలో బుధవారం జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశం నామమాత్రంగా సాగింది. సమావేశానికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ హాజరుకాకపోవడంతో ఎంపీపీ అబుబకర్ సిద్ధిక్ అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో పలు అభివృద్ధి అంశాలపై ఎంపీడీవో రమణ ఆయా శాఖల అధికారులతో చర్చించారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు సైతం హాజరుకాకపోవడంతో సమావేశం నామమాత్రంగా జరిగింది.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్లు స్వాధీనం

బద్వేలు, న్యూస్‌టుడే : అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నట్లు బద్వేలు గ్రామీణ సీఐ నాగభూషణం తెలిపారు. నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం కలువాయికి చెందిన రెండు టిప్పర్లను పీపీకుంట తనిఖీ కేంద్రం వద్ద స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

క్షయ నివారణపై అవగాహన కల్పించాలి

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే : స్థానిక కామనూరులోని పీహెచ్‌సీ కేంద్రాన్ని బుధవారం ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) బృందంలోని వైద్యులు ఫ్రాంక్లిన్, భార్గవి, జయశ్రీ సందర్శించారు. ఈ సందర్భంగా క్షయ బాధితులకు అందిస్తున్న వైద్యం, మందులు, పోషకాహారం తదితర వాటిపై విచారించారు. క్షయ నిర్ధారణ పరీక్షలు, నివారణ కోసం రోగులకు ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారని వైద్యుడు శ్రీనివాస్ ద్వారా వివరాలు తెలుసుకున్నారు. జిల్లా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ప్రవీణ్, సీహెచ్‌వో కృష్ణమ్మ, సూపర్‌వైజర్లు వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చదువుల తల్లీ... నమోస్తుతే

దసరా ఉత్సవాలను ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాలలో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఏడో రోజు బుధవారం ఆలయాలు భక్తులతో రద్దీగా మారాయి. మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారికి బిందె సేవ నిర్వహించారు. ప్రొద్దుటూరులోని అమ్మవారిశాలలో బంగారుబిందెపై అమ్మవారిని ప్రతిష్ఠించి పురవీధుల్లో ఊరేగించారు. కర్ణాటకకు చెందిన 15 మంది కళాకారులతో పాటు మహిళా వీరాగేస్ నృత్యంలో భాగంగా కత్తితో చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. **- న్యూస్‌టుడే బృందం**


కొండాపురంలోని రాఘవేంద్రస్వామి ఆలయంలో


కలసపాడులో..


జమ్మలమడుగులో సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు


ప్రొద్దుటూరులో బిందె సేవలో పాల్గొన్న ఆర్యవైశ్యులు


మైదుకూరు మాధవరాయ స్వామి ఆలయంలో...


ప్రొద్దుటూరు వైఎంఆర్‌కాలనీలోని సాయిబాబా ఆలయంలో...


బి.మఠంలో సరస్వతీదేవిగా వాసవీ కన్యకాపరమేశ్వరి

ఎమ్మెల్యే చొరవతో బస్సు సర్వీసు పునః ప్రారంభం

పెద్దముడియం, న్యూస్‌టుడే : ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి చొరవతో ఆర్టీసీ బస్సు సేవలు పునఃప్రారంభించడంతో భీమగుండం, భూతమాపురం వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామాలకు సుమారుగా 15 ఏళ్లుగా బస్సు సర్వీసు లేక విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యపై గత నెల 26న భీమగుండంలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే చొరవతో బుధవారం జమ్మలమడుగు నుంచి భీమగుండం, భూతమాపురం, కంబాలదిన్నె గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించారు. భీమగుండంలో భాజపా మండల నాయకుడు ధనిరెడ్డి కొండారెడ్డి పూజలు నిర్వహించి బస్సు సర్వీసు ప్రారంభించారు.


భీమగుండంలో బస్సును ప్రారంభిస్తున్న భాజపా మండలాధ్యక్షుడు కొండారెడ్డి

సహకార కేంద్ర బ్యాంకు ప్రారంభం

బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే : బ్రహ్మంగారిమఠంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకును బుధవారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. మండల ప్రజలకు స్వయంఉపాధి, మహిళా సాధికారత, ఆర్థికసహాయం, ఉన్నత, విదేశీ విద్య, చిరువ్యాపారులు, గృహనిర్మాణానికి, బంగారం, వ్యవసాయ రుణాలు, కల్పిస్తున్నారన్నారు. బ్యాంకు సీఈవో రాజమణి, డీజీఎం వెంకటేశ్వర్లు, ఏజీఎం వీరబ్రహ్మం, రామిరెడ్డి, నరసయ్య, తెదేపా మండలాధ్యక్షుడు సుబ్బారెడ్డి, పోలిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

తెదేపాతోనే నీటి నిర్వహణ సాధ్యం


కన్నెలవాగు చెరువు వద్ద జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

మైదుకూరు, ఖాజీపేట, న్యూస్‌టుడే : సాగు, తాగునీటి నిర్వహణ తెదేపాతోనే సాధ్యమని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. ఖాజీపేట మండల పరిధిలోని కన్నెలవాగు చెరువుకు బుధవారం ఆయన నీటిని విడుదల చేసి జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత వైకాపా ప్రభుత్వం రైతులకు సాగు నీరు, ప్రజలకు తాగునీరు ఇవ్వలేదన్నారు. అప్పుడు, ఇప్పుడు రైతులకు సాగు, ప్రజలకు తాగునీరందించిన ఘనత తెదేపాదే అన్నారు. 2014-19లో తెదేపా హయాంలో చెరువులకు కేసీ కాలువ, తెలుగుగంగ కాలువల ద్వారా నీటిని అందించామని, 2024లోనూ చెరువులకు నీటిని అందిస్తున్నామన్నారు. ప్రజలకు మేలు చేయడంలో తెదేపా ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందన్నారు. అనంతరం రైతులు ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో చిన్ననీటి పారుదల శాఖ అధికారులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

వందశాతం సరకులు ఇస్తేనే తీసుకోండి

మైదుకూరు: ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ దుకాణాలకు నిత్యావసర సరకులను తక్కువగా కేటాయిస్తే ఆ నెల పంపిణీ చేయబోరని, డీలర్లు ఎవరూ తీసుకోవద్దని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ డీలర్లకు సూచించారు. వందశాతం సరకులు అందిస్తేనే తీసుకోవాలన్నారు. రేషన్ దుకాణ డీలర్ల సమస్యలు, ప్రజాపంపిణీ వ్యవస్థ తీరుపై బుధవారం పురపాలక కార్యాలయంలోని సభా భవనంలో మండలంలోని డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సరకులు తక్కువగా సరఫరా చేస్తే కలెక్టరు, జేసీ దృష్టికి తీసుకురావాలని బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్‌కు సూచించారు. నిత్యావసర సరకులను కొందరికే పంపిణీ చేయడం సరికాదన్నారు. డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను నెల రోజుల్లో పరిష్కరిస్తారని, తర్వాత రేషన్ సక్రమంగా సరఫరా చేయాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు అందితే సహించేదిలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో డీలర్ల వద్ద ఉన్న బ్యాక్‌లాగ్‌ను స్వాధీనం చేసుకుని ప్రస్తుత డీలర్‌కు అప్పగించాలని సూచించారు. గత డీలర్ల నుంచి బ్యాక్‌లాగ్‌ను స్వాధీనం చేసుకుంటామని బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ తెలిపారు. మండలంలో చౌకదుకాణాల సంఖ్య పెంచుతున్నట్లు తెలిపారు. మైదుకూరు, బ్రహ్మంగారిమఠం మండలాల్లో ప్రభుత్వ భూములపై కమిటీ వేసి నిగ్గు తేల్చాలని ఆర్డీవో చంద్రమోహన్‌కు సూచించారు. దీనిపై కలెక్టరుతో చర్చించినట్లు తెలిపారు. ప్రభుత్వ భూముల ఆక్రమణ, అనర్హులకు కేటాయింపు తదితర అంశాలపై విచారణ చేపట్టాలన్నారు. భూములు లేని వారు చాలా మంది ఉన్నారని, ఉన్నవారికి ఎక్కువ విస్తీర్ణంలో ప్రభుత్వ భూములు కేటాయించారన్నారు.

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

జాతీయ స్థాయి క్రీడలకు ఎంపిక

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే: కడప నగర శివారులోని సీకేదిన్నె మండలంలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ కంప్యూటర్ సైన్సు మూడో సంవత్సరం విద్యార్థి రాముడు జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్ రెడ్డి తెలిపారు. అతడిని కళాశాల ఛైర్మన్ చొప్పా గంగిరెడ్డి, వైస్ ఛైర్మన్ చొప్పా యల్లారెడ్డి, అధ్యాపకులు, పీడీ అభినందించారు.

సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీలకు .. .కడప క్రీడలు : రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు కె.మహేష్ హైజంప్ విభాగంలో బంగారు, డెకథ్లాన్‌లో రజతం, ఎం.లోకేశ్వరరావు 800 మీటర్ల పరుగులో రజతం, ఎం.చెన్నమ్మ 4×400 రిలేలో రజత పతకం సాధించి సౌత్ ఇండియా అథ్లెటిక్స్ మీట్-2024 పోటీలకు ఎంపికయ్యారు. వారిని కళాశాల ప్రిన్సిపల్ జి.రవీంద్రనాథ్, వైస్ ప్రిన్సిపల్ ఎం.రమేష్, ఇన్‌ఛార్జి పీడీ టి.హజరతయ్య అభినందించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వవిద్యార్థులు

పులివెందుల (వేంపల్లె), న్యూస్‌టుడే: పులివెందులలో బుధవారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1997-99 సంవత్సరాలల్లో ఇంటర్మీడియట్ చదువుకున్న విద్యార్థులు ఒకచోట చేరి అలనాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. అప్పటి గురువులైన విశ్రాంత ప్రిన్సిపల్ అంకిరెడ్డి, అధ్యాపకులు దేరంగుల కృష్ణయ్య, సుబ్బరాయుడు, నారాయణరెడ్డిని ఘనంగా సత్కరించారు. 25 ఏళ్ల తర్వాత వీరంతా ఒకచోట చేరడం హర్షనీయమని అధ్యాపకులు పేర్కొన్నారు. శ్యామ్ సుందర్‌నాయుడు, సురేష్‌రెడ్డి, నాగమణి, ప్రమోద, సునీత, తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)
కడప : 8008573428, 8688701384
పులివెందుల : 8008573466
కమలాపురం : 8008573475

స్పందన... వందనం

● కడప రవీంద్రనగర్‌లో గత నాలుగు రోజుల నుంచి చెత్తను తీసుకెళ్లడం లేదంటూ 'ఈనాడు'లో కథనం ప్రచురితం కావడంతో నగరపాలక అధికారులు స్పందించి చెత్తను తొలగించారు.

● కడప విశ్వేశ్వరయ్య విగ్రహం నుంచి ప్రకాష్‌నగర్‌కు వెళ్లే దారి పక్కన మట్టికుప్పలు వేయడం వల్ల రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని 'ఈనాడు'లో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి మట్టికుప్పలు తొలగించారు. - న్యూస్‌టుడే, చిన్నచౌకు

● కమలాపురం పట్టణంలో ... వెళ్లే దారిలో కుళాయి చుట్టూ మురుగు చేరిందని 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలనరసింహులు స్పందించి, కుళాయి చుట్టూ శుభ్రం చేయించారు.

● కమలాపురంలోని సంబటూరు బస్టాండ్ నుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లే దారిలో చెత్త తొండి నిండి దుర్వాసన వస్తుందని ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి చెత్తను తొలగించారు.

- న్యూస్‌టుడే, కమలాపురం

నాలుగు నెలలు... నలుగురు కమిషనర్లు

కడప నగరంలో కీలక పోస్టు ఖాళీ

కుంటుపడుతున్న అభివృద్ధి


న్యూస్‌టుడే, కడప నగరపాలక సంస్థ

కడప నగరపాలక సంస్థ కమిషనర్ పోస్టు ఖాళీగా ఉండడంతో నగరాభివృద్ధిపై తీవ్ర ప్రభావం పడుతుంది. జులై 20 నుంచి ఇప్పటివరకు ఇక్కడ పూర్తిస్థాయి కమిషనర్ ఎవరూ లేరు. పోస్టింగ్ ఇచ్చిన వారు రావడం లేదు. ఐఏఎస్‌లుగాను నియమితులైన వారు బదిలీపై వెళ్లిపోయారు. ఇలా గడిచిన నాలుగునెలల్లో నలుగురు అధికారులు మారడం ఇక్కడ పరిస్థితి దర్పణం పడుతోంది.

జులై నుంచి... : కడప కమిషనర్‌గా తనదైన ముద్రను వేసుకున్న ఐఏఎస్ అధికారి సూర్యసాయిప్రవీణ్‌చంద్ జులై 20న నీతిఆయోగ్ అదనపు కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మరో ఐఏఎస్ అధికారి తేజ్‌భరత్‌ను నియమిస్తూ అదే రోజున ఉత్తర్వులు జారీ చేశారు. కానీ ఆయన రాలేదు. ఈ తర్వాత ఆగస్టు 13న కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వీసీగా నందన్ ఎఫ్‌ఏసీ ఇస్తూ కమిషనర్‌గా నియమించారు. ఆగస్టు 30న ఆయనను కూడా బదిలీ చేశారు. పలమనేరు ఆర్డీఓగా పనిచేస్తున్న మనోజ్‌రెడ్డిని కడప కమిషనర్‌గా బదిలీ చేస్తూ సెప్టెంబర్ 26న ఉత్తర్వులిచ్చారు. ఇప్పటివరకు ఆయన విధుల్లో చేరలేదు. ఈ నేపథ్యంలో జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న అదితిసింగ్‌ను ఇన్‌ఛార్జి కమిషనర్‌గా నియమిస్తూ కలెక్టర్ ఆదేశాలిచ్చారు.

పడకేసిన ప్రగతి

కడప నగరపాలక సంస్థ పరిధిలో 16 కీలక రహదారులను విస్తరించాలనేది లక్ష్యం. ఇప్పటి వరకు నాలుగు రోడ్లు మాత్రమే పూర్తయ్యాయి. బ్రహ్మంసాగర్ నుంచి కడపకు నీటిని తీసుకురావడానికి రూ.570 కోట్లతో చేపట్టే పనులపై అడుగు పడడం లేదు. బుగ్గవంక రక్షణగోడ పక్కన రహదారుల అభివృద్ధిపై నీటిపారుదల శాఖతో కలిసి పనిచేయాలి. 21 వరదల కాల్వల నిర్మాణానికి టెండర్లు పిలవగా మూడు చోట్ల పనులు మొదలయ్యాయి. వాటిలో ఒక్కటీ పూర్తి కాలేదు. భూగర్భ మురుగునీటి వ్యవస్థ నవీకరణ పనులు అటకెక్కాయి. నగరంలోని దాదాపు 14 డివిజన్లలో నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. కమిషనర్ లేకపోవడంతో పాలనావ్యవహారాలు కుంటుపడ్డాయి. వివిధ స్థాయిల్లో ఇష్టారాజ్యంగా ఉద్యోగుల సీట్లు మార్చడం చర్చనీయాంశమైంది.



నగరపాలిక కార్యాలయం

చేతులెత్తేసిన పాలకవర్గం

కార్పొరేషన్ పాలనాపగ్గాలు వైకాపా చేతిలో ఉన్నాయి. రాష్ట్రంలో తమ ప్రభుత్వం లేదు కాబట్టి తాము చేసేదేమీ లేదని నగరపాలక సంస్థ పాలకవర్గం చేతులెత్తేసింది. కమిషనర్ కుర్చీ భర్తీ అయితేనే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని, ప్రభుత్వం దీనిపై దృష్టిపెట్టాలని నగరవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కళాకృతి ఆర్ట్ గ్యాలరీ ప్రారంభం

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: చిత్రకారుల మేధస్సు అసామాన్యమని, వారు అద్భుతమై కళాఖండాలు వేయగలరని ఫ్యామిలీ కోర్టు జడ్జి ఇంతియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. కడపలో బుధవారం కళాకృతి ఆర్ట్ గ్యాలరీ, ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. నిర్వాహకులు డాక్టర్ మాధవి మాట్లాడుతూ తన్జోర్‌పెయింటింగ్, కాన్వాస్, బ్రాస్ ఆర్టిస్ట్రీ, హ్యాండీక్రాఫ్ట్ ప్రదర్శనలో ఉంచామన్నారు. చిత్ర కళాకారులు భాస్కర్‌రెడ్డి, శేర్వాణి, ఆనంద్‌ప్రసాద్, వెంకటేశ్, మృత్యుంజయరావు, గిరి చరిత, శ్రీను గీసిన చిత్రాలను ప్రదర్శనలో ఉంచి వారిని సత్కరించారు. డాక్టర్ సుబ్రహ్మణ్యం, మాజీ ఎంపీ రామమునిరెడ్డి, న్యాయవాది లక్ష్మీనారాయణ, ప్రముఖ వైద్యులు వైపీ సుబ్బారెడ్డి, సుబ్బారావు, పల్లాభాస్కర్, శ్రీదేవి, సామాసుధ, కళావతి, ప్రసాద్, సాయికిషన్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్ట్స్ గ్యాలరీ ప్రారంభిస్తున్న ఫ్యామిలీ కోర్టు జడ్జి ఇంతియాజ్, డాక్టర్ మాధవి తదితరులు



లలిత పంచాయతన ఆలయంలో సరస్వతిదేవిగా



కడప అమ్మవారిశాలలో..



నానాపల్లె అమ్మవారి ఆలయంలో



కమలాపురంలో..



గడ్డిబజార్‌లో...



వేములలో ...

సరస్వతీ... ప్రణమిల్లితి



వల్లూరులో...



నందిమండలంలో...

విజయదశమి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మూల నక్షత్రం సందర్భంగా అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థులు పెద్దసంఖ్యలో తరలివచ్చి తమ చదువులు బాగా సాగాలని వీణాపాణిని మొక్కుకున్నారు. సాయంత్రం భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. **- న్యూస్‌టుడే, బృందం**



ఎర్రముక్కపల్లెలో మారెమ్మ



సత్యనారాయణ స్వామి ఆలయంలో

సమస్యల పరిష్కారానికి మహిళా దర్బార్


సిద్దవటం, న్యూస్‌టుడే : బెటాలియన్‌లో మహిళల సమస్యల పరిష్కరించేందుకు కృషిచేస్తున్నామని బాధ్య కమాండెంటు నాగేశ్వరప్ప తెలిపారు. సిద్దవటం మండలం భాకరాపేట శివారులో ఉన్న ఏపీఎస్పీ పదకొండో బెటాలియన్‌లో బుధవారం మహిళా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. అమరవీరుల కుటుంబాలకు చెందిన పలువురు మహిళలు తమ సమస్యలను బాధ్య కమాండెంటు దృష్టికి తీసుకొచ్చారు. సహాయ కమాండెంట్లు విల్సన్, ఎస్‌డీ ప్రసాద్, యూనిట్ వైద్యాధికారిణి దివ్యరాణి, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

వాలంటీర్లను కొనసాగించాలని వినతి


కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: రాజీనామాలు చేసిన వాలంటీర్లను తిరిగి విధుల్లో కొనసాగించాలని ఏపీ రాష్ట్ర వాలంటీర్ల సంఘం కడప డివిజన్ బాధ్యుడు సయ్యద్ ఇషాక్ అహమ్మద్ అన్నారు. కడప ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తమ చేత బలవంతంగా రాజీనామాలు చేయించారని ఆరోపించారు. తక్షణం వారందరిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. సుబ్బయ్య, బాలగంగయ్య, సుబ్బారెడ్డి, ఈశ్వరయ్య తదితరులున్నారు.

అక్రమార్కులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

మారుతీనగర్, న్యూస్‌టుడే: యోగి వేమన విశ్వవిద్యాలయంలో అవుట్‌సోర్సింగ్ నియామకాల్లో రిజర్వేషన్ నిబంధనలకు ఉల్లంఘించిన అప్పటి వీసీ రామకృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ గులాం తారిఖ్‌లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, విచారణ చేపట్టాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగాసురేష్ డిమాండు చేశారు. స్థానిక జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ వారు అక్రమాలకు పాల్పడి నియామకాలు చేపట్టారని, దీనిపై ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ప్రభుత్వం తక్షణమే విచారణ చేపట్టాలని డిమాండు చేశారు.







తిరుమలకు తెదేపా శ్రేణుల పాదయాత్ర

వల్లూరు, న్యూస్‌టుడే: పైడికాలువ గ్రామానికి చెందిన తెదేపా నాయకులు ఆకుల శ్రీనివాసులు, ఆకుల వెంకటసుబ్బయ్య సోదరుల ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు తిరుమలకు చేపట్టిన పాదయాత్రను బుధవారం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి ప్రారంభించారు. తొలుత శ్రీరాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో పుత్తా పూజలు నిర్వహించారు. ఏటూరు రామచంద్రారెడ్డి, మండల సమన్వయకర్త నాగేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రకు వెళ్లేవారితో పుత్తా నరసింహారెడ్డి

వైభవంగా బిందెసేవ ఉత్సవం

మారుతీనగర్, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూలానక్షత్రం సందర్భంగా బుధవారం నగరంలోని పలు కూడళ్లలో ఆర్యవైశ్య సోదరులు బిందెసేవ ఉత్సవం నిర్వహించారు. అమ్మవారి ప్రతిమతో ప్రదక్షిణలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తల్లం సతీష్, రాంమహేష్, రమణయ్య, నాగరాజు, దసరా ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కమలాపురం : దసరా ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక అమ్మవారిశాల నుంచి రైల్వే గేట్ వరకు ఆర్యవైశ్య యువకులు బిందె సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముంబయికి చెందిన కళాకారులు వాయిద్యాలు, డోళ్లు వాయిస్తూ నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. ముందుగా అమ్మవారికి మహిళలు కుంకుమార్చన నిర్వహించారు.



కడపలో కేరళ కళాకారుల సందడి



కమలాపురం : ఆకట్టుకున్న డోలు వాయిద్య కళాకారుల విన్యాసం



కడపలో ప్రదర్శనలు చేస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు, ఉపవాస దీక్షాపరులు



కమలాపురంలో బిందె సేవలో యువకులు



వేంపల్లెలో ఆర్యవైశ్యుల ప్రదర్శన

వైభవంగా సీతారాముల కల్యాణం

వల్లూరు, న్యూస్‌టుడే: తప్పెట్ల రామాలయంలో బుధవారం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఇటీవల రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం కల్యాణ క్రతువును వేదపండితుడు గడియారం సుబ్బరాయమ్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటుచేశారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

కడప నగరపాలక, న్యూస్‌టుడే: వైకాపా బలోపేతానికి అందరూ కృషి చేయాలని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డి సూచించారు. పార్టీకి చెందిన ముఖ్యనాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అధికారపార్టీ బెదిరింపులకు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులకు అన్యాయం జరిగితే సహించబోమని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, రామసుబ్బారెడ్డి, గోవిందరెడ్డి, ఎమ్మెల్యేలు దాసరి సుధ, ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మేయర్ సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యేలు అంజాద్‌బాషా, శివప్రసాద్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోమశిల బాధితులకు ఉద్యోగాలివ్వాలని వినతి

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: సోమశిల జలాశయం నిర్మాణంతో ముంపునకు గురైన గ్రామాల బాధితులకు ఉద్యోగాలు ఇవ్వాలని మంగళగిరిలో తెదేపా కేంద్ర కార్యాలయంలో నీటిపారుదలశాఖ మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుకు తెదేపా పద్మశాలి సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు కోదండరామ్, రాజంపేట పార్లమెంటు కన్వీనరు ఎ.వెంకటసుబ్బయ్య బుధవారం వినతిపత్రం సమర్పించారు.

విద్యార్థినులకు ఉచిత నైపుణ్య శిక్షణ

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: బెంగళూరుకు చెందిన యునెక్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో కడప నగరంలోని వివేకానంద మహిళా డిగ్రీ కళాశాలలోని విద్యార్థినులకు ఇచ్చిన ఉచిత నైపుణ్య శిక్షణ బుధవారం ముగిసింది. నెల రోజుల పాటు మొత్తం 65 మంది విద్యార్థులకు ఆంగ్లం, లైఫ్ స్కిల్స్, సాంకేతికత, ఉద్యోగ నైపుణ్య అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు ట్రైనర్ ఎ.శిరీషాబాయి పేర్కొన్నారు.